క్లుప్తంగా

కంటివైద్య శిబిరం



నారాయణపేట రూరల్: మండలంలోని బైరంకొండ గ్రామంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, కంటి శుక్లాల సమస్య ఉన్న వారిని ఆపరేషన్ కోసం రిఫర్ చేశారు. మిగితా వారికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుభద్రమ్మ, పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి, గ్రామ పెద్దలు ఆశప్ప, పోలమ్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు తగ్గించాలి

మరికల్: గ్రామాల్లో విద్యుత్ కోతలను తగ్గించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు హన్మంతు, రాములు అన్నారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ రెండు నెలల నుంచి గ్రామాల్లో తరుచుగా విద్యుత్ కోతలు విధించడం వల్ల తాగునీటికి ఇబ్బందిగా మారిందన్నారు. రాత్రి సమయంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడో పోతుందో తెలియని పరిస్థితులు ఏర్పడాయని ఆందోళన వ్యక్తం చేశారు. కరెంట్ లేకపోవడంతో చీకట్లో ఇళ్ల వద్ద విషసర్పాలు వస్తున్నట్లు వారు వాపోయారు. ప్రస్తుతం వరి తుకాలు వేసుకునే సమయంలో కూడా కరెంట్ కష్టాలు తప్పడం లేదన్నారు. వెంటనే ట్రాన్స్‌కో అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా నిరంతరం సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు.

శ్రీవారి సన్నిధిలో కొత్తపల్లి భజన బృందం

మద్దూరు: కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన భజన భక్తులు 10మంది గురువారం తిరుమల కొండపై అఖండ హరినామ సంకీర్తనశాలలో భజన నిర్వహించారు. ప్రతి ఏడాది తమ గ్రామం నుంచి భక్తులు ఇక్కడి వచ్చి రెండు రోజుల పాటు భజనలు చేస్తామని భక్తులు పేర్కొన్నారు. స్వామివారి దర్శనానంతరం ఈ సేవలో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, నీలారెడ్డి, వెంకప్పగౌడ్, నారాయణరెడ్డి, రాంచంద్రయ్య, తిమ్మన్న, మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన గదుల కూల్చివేత

మరికల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శిథిలావస్థకు చేరిన మరో రెండు తరగతి గదుల కూల్చివేతకు అధికారులు చర్యలు చేపట్టారు. పది రోజుల క్రితం కూల్చివేసిన గదులను కాకుండా పక్కనే ఉన్న మరో రెండు గదులను కూడా కూల్చివేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో పనులు ప్రారంభించారు. మొత్తం శిథిలావస్థకు చేరిన గదులను కూల్చివేయడంతో విద్యార్థులకు విశాలమైన క్రీడామైదానం లభించే అవకాశం ఉంది.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



ఆత్మకూర్: ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని పిన్నంచర్లలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా దోమ తెర వాడాలని సూచించారు.

అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



అమరచింత: పురుటి నొప్పులతో బాధపడుతున్న నిండు గర్భిణిని అంబులెన్స్‌లో ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో అంబులెన్స్‌లోనే ప్రసవించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. అమరచింత మండలంలోని దీప్లానాయక్‌తండాకు చెందిన నందు పురిటి నొప్పులు అధికం కావడంతో ప్రసవం కోసం అంబులెన్స్‌లో ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు. మార్గమధ్యలో ఖానాపురం స్టేజీ సమీపంలో నొప్పులు అధికం కావడంతో ఈఎంటీ యశోద అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. అనంతరం వైద్య సేవల కోసం తల్లి, బిడ్డను ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు పైలట్ యుగంధర్ తెలిపారు.

విధుల్లో చేరిన జీహెచ్‌ఎంలు



పెద్దకడ్మూర్‌లో జీహెచ్‌ఎంగా బదిలీపై వచ్చిన భాగ్యలక్ష్మిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నర్వ: ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా మండలానికి కేటాయించిన గెజిటెడ్ ప్రిన్సిపాళ్లు గురువారం తమ విధుల్లో చేరారు. జెడ్పీహెచ్ఎస్ పాథర్చేడ్‌కు కొత్తమొల్గర నుంచి రాజశేఖర్, జెడ్పీహెచ్ఎస్ నర్వకు టంకర నుంచి రామకృష్ణ, జెడ్పీహెచ్ఎస్ పెద్దకడ్మూర్‌కు మహబూబ్‌నగర్ నుంచి భాగ్యలక్ష్మి, జెడ్పీహెచ్ఎస్ కల్వాల్‌కు నాగల్‌కడ్మూర్ నుంచి చంద్రశేఖర్, జెడ్పీహెచ్ఎస్ ఉందేకోడ్‌కు గండీడ్ నుంచి రాంరెడ్డి జీహెచ్‌ఎంగా బదిలీపై వచ్చారు. కొన్నేళ్లగా మండలంలో రెగ్యూలర్ జీహెచ్‌ఎంలు, ఎంఈఓలు లేకపోవడంతో విద్యావ్యవస్థ కుంటుపడిందని, ఎట్టకేలకు జీహెచ్‌ఎంలు రావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి

కృష్ణా: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంగా కిషోర్‌కుమార్, గుడెబల్లూర్ ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంగా గణేష్ గురువారం బాధ్యతలు చేపట్టడంతో వారికి కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, సీఆర్పీ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాగనూర్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతిపై వచ్చి బాధ్యతలు చేపట్టిన మురళీధర్‌రెడ్డికి మాగనూర్ మండల పీఆర్టీయూ సభ్యులు ఘన స్వాగతం పలకడంతో పాటు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు పి.నరేందర్ మాట్లాడుతూ.. నూతనంగా మాగనూర్ మండలానికి బదిలీపై విచ్చేసిన ఉపాధ్యాయులందరికీ యూనియన్ తరపున అన్ని విధాల సహాయ సహకారం అందిస్తామన్నారు. అదే విధంగా వడ్వాట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జీహెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన గురురాజారావుకు పాఠశాల ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.

కోస్గి: మండలంలోని సర్జఖాన్‌పేట జెడ్పీహెచ్ఎస్‌కు కృష్ణగౌడ్, జెడ్పీహెచ్ఎస్ బహార్‌పేట్ వెంకటేశ్వరి, కోస్గి ఉర్దూ మీడియం పాఠశాలకు బషీర్ అహ్మద్, ముశ్రీఫా జెడ్పీహెచ్ఎస్‌కు శేఖరయ్య, బోగారం పాఠశాలకు వెంకట్‌రెడ్డి, గుండుమాల్ పాఠశాలకు శేఖర్‌రెడ్డి, మీర్జాపూర్ పాఠశాలకు వెంకట్రాంరెడ్డి జీహెచ్‌ఎంలుగా బాధ్యతలు గురువారం తీసుకున్నారు.



మాగనూర్ నూతన ప్రధానోపాధ్యాయులకు సన్మానం చేస్తున్న పీఆర్టీయూ సభ్యులు



కృష్ణా ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కిషోర్‌కుమార్‌ను సన్మానించిన కాంప్లెక్స్ ఉపాధ్యాయులు

దయాకర్‌రెడ్డి సేవలు మరువలేనివి



కృష్ణాలో దయాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

మక్తల్: మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి నియోజకవర్గానికి చేసిన సేవలు మరువలేనివని నాయకులు అన్నారు. దయాకర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలో శ్రీపడమటి అంజనేయ స్వామి ఆలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి చేతుల మీద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిదార్థరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రవీందర్, భీమేష్ ఉన్నారు.

కృష్ణా: మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి మరణించినా ఆయన ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి, సేవ కార్యక్రమాలు తమ జ్ఞాపకాల్లో పదిలంగా ఉన్నాయని కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు కొన్ని తరాల వరకు ఆయన చేసిన సేవ కార్యక్రమాలను గుర్తుచేసుకుంటారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణామూర్తి, లక్ష్మీనారాయణగౌడ్, గుండప్ప, రాంలింగప్ప, రాకేష్, లింగప్ప, శంఖర్, హన్మంతు, శ్రీనివాస్, తారేష్, జిందప్ప, జంబయ్య పాల్గొన్నారు.

నీట్ అవకతవకలపై విచారణ చేయాలి

నారాయణపేట రూరల్: నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా సెక్రెటరీ సాయికుమార్ డిమాండ్ చేశారు. ఎన్నో ఆశలు, కలలతో నీట్ పరీక్షకు హాజరైన సాధారణ, మధ్య తరగతి విద్యార్థులకు నష్టం జరిగిందని వాపోయారు. పరీక్షలో 67మందికి ఒకే ర్యాంకు రావడం అనుమానంగా ఉందని, పేపర్ లీకేజీలు, కార్పొరేట్ కళాశాలల వికృత చేష్టలతో చాలా మందికి అన్యాయం జరుగుతుందని విమర్శించారు. వెంటనే సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా చూడాలని తెలిపారు.

మిషన్ భగీరథ నల్లా కలెక్షన్ల సర్వే



ఊట్కూరు: మండలంలో కొనసాగుతున్న మిషన్ భగీరథ కులాయిల ఇంటింటి సర్వేను ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ పరిశీలించారు. ఊట్కూరులోని భరత్‌నగర్, మెయిన్‌బజార్ తదితర ప్రాంతాల్లో ఇంటింటి తిరిగి యజమానుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాలుగురోజులుగా మండలంలోని అన్ని గ్రామాల్లో కులాయిల ఇంటింటి సర్వే కొనసాగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఎంపీఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: మున్సిపల్ అభివృద్ధికి ఆయా వార్డు కౌన్సిలర్లతో కలిసి ప్రత్యేక దృష్టి సారించామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. మున్సిపల్ సమావేశ మందిరంలో గురువారం చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మొత్తం 24 అంశాలతో సమావేశం నిర్వహించామన్నారు. వీటిలో ఒక అంశం తీర్మానం చేయదన్నారు. కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది వేతనాలు, వారికి సేఫ్టీ పరికరాల కొనుగోలు చేయుటకు, నలుగురు సిబ్బందిని రీప్లేస్మెంట్ చేసేందుకు ఆమోదం తెలిపామన్నారు. అదేవిధంగా కార్యాలయ నిర్వహణకు ఖర్చు, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, హరితహారం, విద్యుత్ చార్జీలు మొదలగు అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు.

సంఘటితంగా ముందుకు..

ప్రజలు తమకు ఇచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకుంటూ వార్డుల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించే విధంగా కౌన్సిల్ సభ్యులు కలిసి రావాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసుకొనేందుకు ఇప్పటికే ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి విన్నవించామని తెలిపారు. పట్టణంలో పారిశుద్ధ్య పనులపై దృష్టి సారిస్తున్నామని, అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకొనేందుకు సిద్ధంగా ఉన్నామని మున్సిపల్ కమిషనర్ నురుల్ నదీం అన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



ముశ్రీఫా ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ తదితరులు



లక్కాయిపల్లిలో..



ఊట్కూరులో..

కోస్గి: ప్రభుత్వ పాఠశాలల్లోనే శిక్షణ పొందిన నిష్ణాతులైన ఉపాధ్యాయులుంటారని, ప్రైవేట్‌తో పోల్చుకుంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు పోషప్ప అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాలతో విద్యార్థులకు బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తూ మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత యూనిఫాంలు అందజేస్తుందన్నారు. ఇందులో పాఠశాల హెచ్‌ఎం బాలకృష్ణ, ఉపాధ్యాయ బృందం, పలువురు పాల్గొన్నారు.

ఊట్కూరు: ఊట్కూరులోని సీపీఎస్ పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయురాలు సునంద, ఎంపీటీసీ పద్మ విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల యూనిఫాంను మహిళా సంఘ సభ్యులు సకాలంలో కుట్టడం సంతోషకరం అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా రెండు జతల దుస్తులు, పాఠ్య, నోట్ పుస్తకాలు, మధ్యాహ్నం పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని వల్లంపల్లి పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ సురేష్‌కుమార్, పాఠశాల చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు భ్రమరాంబ, శిరీష, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలోని లక్కాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలను పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్ పంపిణీ చేశారు. దాదాపు 61 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు ఒక జత దుస్తులను పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పీహెచ్‌సీలో మెరుగైన సేవలందించాలి



వైద్య సేవల గురించి ఆరా తీస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నర్వ: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సిబ్బందికి సూచించారు. గురువారం నర్వ పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతకంటే ముందు ఉంద్యాల్ పంప్‌హౌస్ వద్ద దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డితో కలిసి నీటిని వదిలారు. అనంతరం మహాత్మాజ్యోతిబాపులే గురుకుల పాఠశాల భవనం, గ్రౌండ్ ఏర్పాటు కోసం రాంపూర్ వద్ద స్థలం పరిశీలించారు. అనంతరం నర్వ పీహెచ్‌సీని సందర్శించి రోగులకు, ఆస్పత్రిలో అందిస్తున్న ఓపీ సేవలను ఇన్‌చార్జ్ వైద్యుడు డా.వెంకటరమణను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, చెన్నయ్యసాగర్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శరణప్ప, వివేక్, రవిసాగర్, అయ్యపురెడ్డి, రామన్‌గౌడ్, అశోక్‌గౌడ్, నర్సింహా తదితరులు ఉన్నారు.

‘ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు సరికాదు’



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మక్తల్: ఎమ్మెల్యే వాకటి శ్రీహరిపై అసత్య ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదని స్థానిక కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. వాకిటి శ్రీహరి ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ఆయన వర్గానికే చెందిన నాయకులను ప్రోత్సహించి, మిగిలిన వారిని దూరం పెడుతున్నారని ప్రతిపక్ష నాయకులు మాట్లాడడంపై వారు మండిపడ్డారు. బీసీ నాయకుడు రాజకీయంగా ఎదిగితే ఎందుకు ఈర్ష పడుతున్నారని, 70 ఏళ్ల తర్వాత బీసీ వర్గానికి చెందిన శ్రీహరి రాజకీయంగా ఎదగడం చూపి ఓర్వలేని తనంతో ఈ ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అన్ని కులాలు, మతాల వారికి సమాన అవకాశాలు కల్పించి మండల బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు అన్ని గమనిస్తున్నారని, ఇప్పటికైనా వారు దిగజారుడు ఆరోపణలు మానుకోవాలని హితువు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇలాంటి వారికి బుద్ధి చెప్పేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోళ్ల వెంకటేష్, తిరుపతి, నర్సిములు, నారాయణ, శంషోద్దీన్, అంజప్ప, కర్రెం అంజప్ప, రహీంపటేల్, ఉమర్‌బాస్రావి, రహీంపటేల్, బ్యాగరి సురేష్ పాల్గొన్నారు.

హమాలీల కూలి పెంచాలి



మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికసంఘం నాయకులు

మక్తల్: హమాలీ కార్మికులకు కూలీ రెట్లు పెంచాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కిరణ్ అన్నారు. ఈ మేరకు గురువారం మక్తల్‌లో ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం కిరణ్ మాట్లాడుతూ నిత్యవసర ధరలు విపరీతంగా పెరిగాయని, కూలీ రేట్లకు సంబంధించి ఇది వరకు చేసిన ఒప్పదం గడువు ముగిసిందన్నారు. మార్కెట్‌లో ఏ వస్తువు కొనాలన్నా ధరలు అధికంగా ఉంటున్నాయని, తమ పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేని స్థితిలో కాలం వెళ్లదీస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. పనికి తగిన కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, అయ్యప్ప, ఆనంద్, పాండు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు, ఎరువులతో అప్రమత్తం



రైతులతో మాట్లాడుతున్న ఏఈఓ తిరుపతి

కోస్గి: రైతులు నకిలీ విత్తనాలతో అప్రమత్తంగా ఉండాలని ఏఈఓ తిరుపతి సూచించారు. ఈ మేరకు గురువారం మండలంలోని ముంగిమళ్లలో రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. మార్కెట్‌లో కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలు అమ్ముతూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. రైతులు విధిగా వ్యవసాయ శాఖ అనుమతులు ఉన్న దుకాణంలోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలుకు సంబంధించి రశీదు తీసుకోవాలని సూచించారు. పాకింగ్ లేకుండా లూజ్‌గా విక్రయించే విత్తనాలను కొనుగోలు చేయరాదని కోరారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు గుర్తిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇదే క్రమంలో రైతులు ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు నాటుకొని తమ పొలాలను సారవంతం చేసుకోవాలన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం



నేరడగంలో పేరుకుపోయిన మురుగు

మాగనూర్: సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించింది. వివిధ హోదాల్లో ఉన్న అధికారులకు అదనంగా ఈ బాధ్యతలను అప్పగించడంతో వారు గ్రామాలకు సమయాన్ని కేటాయించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. కొంతమంది కార్యదర్శులకు ఈ బాధ్యతలను అప్పగించడంతో.. వారు కూడా పట్టించుకోవడం లేదని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ, మండల అధికారులు, కార్యదర్శులకు ప్రధానంగా ఈ ప్రత్యేక బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. కానీ చాలామంది అధికారులు ఇప్పటివరకు గ్రామాలకు పోయిన దాఖలాలు లేవని వారు ఆరోపిస్తున్నారు. నీటి సమస్య, విద్యుత్, డ్రైయినేజీ తదితర సమస్యలు గ్రామాల్లో పేరుకుపోతున్నాయని, సర్పంచుల పదవీకాలం ముగియడంతో వారు కూడా దృష్టి సారించడం లేదని పలువురు అంటున్నారు. గ్రామ సమస్యలు ఎవరికీ చెప్పుకోవాలో కూడా తెలియక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా గ్రామాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు సమస్యలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

అమరచింత: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో మున్సిపాలిటీ పాలకవర్గం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు ఆరోపించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఐ మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, మహిళల మరుగుదొడ్లు, వీధిలైట్లు, ఇళ్లపై ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ల తొలగింపు పనులు వెంటనే పరిష్కరించాలన్నారు. 4 ,5, 6, 7 వార్డుల్లో మహిళలకు సామూహిక మరుగుదొడ్లను నిర్మించాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి పాల్ మెమోరియల్ స్కూల్ వరకు ఉన్న చెరువు కాల్వను తొలగించి వాటి స్థానంలో అండర్ డ్రెయినేజీ నిర్మించి కాలనీవాసుల సమస్యను పరిష్కరించట్లేదని విమర్శించారు. కొత్త బస్టాండ్ నుంచి మస్తీపురం క్రాస్ రోడ్ వరకు ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపాలిటీ పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయినా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని ఎద్దేవా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీంకు అందించారు. కార్యక్రమంలో అబ్రహం, భాస్కర్, శ్యాంసుందర్, రవీందర్, కుతుబ్, రఘు, మల్లేష్, ఇజ్రాయిల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

ఆత్మకూర్: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టి విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఎంఈఓ భాస్కర్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని, ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, టై, బెల్టు, షూస్, యూనిఫాం విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలల యాజమన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, రమేష్, ప్రణయ్, రవి తదితరులు ఉన్నారు.